బ్రహ్మోత్సవాలకు

భక్తులకు విస్తృత ఏర్పాట్లు

-వాహనసేవలు వీక్షించేలా మాఢవీధుల్లో విశాలమైన గ్యాలరీలు
7లక్షల లడ్డులు బఫర్‌స్టాక్ -టిటిడి ఈఓ శ్యామలరావు

తిరుమల,ఆగస్ట్ 24ప్రభాతవార్తప్రతినిధి:
ఈ ఏడాది అక్టోబర్ 4నుండి 12వతేదీ వరకు జరగనున్న సాలకట్లవార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయని, కన్నులపండువగా నిర్వహించేలా చూస్తామని టిటిడి ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. తొమ్మిదిరోజులు ఉదయం ,రాత్రి వాహనసేవలు ప్రశాంతంగా వీక్షించేలా గ్యాలరీలు విశాలంగా ఉంటాయన్నారు. ఇందులో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. టిటిడిలోని అన్ని విభాగాల అధికారులతో శనివారం సాయంత్రం అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ శ్రీధర్, ఎఫ్ఎసిఎఓ బాలాజీ, సిఈ నాగేశ్వరరావు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి,పిఆర్ఓ నీలిమ, విఎస్ఓలు నెట్టం తులసీ వెంకటరామ్‌కుమార్, అల్లంసురేంద్రతో కలసి సుదీర్ఘసమీక్ష జరిపారు. అనంతరం ఈఓ శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముఖ్యంగా అక్టోబర్ 4వతేదీ సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహనసేవ, అక్టోబర్ 8వతేదీ గరుడసేవ ,12వతేదీ చక్రస్నానమహోత్సవంముఖ్యమన్నారు.వైకుంఠమ్ కంపార్టుమెంట్లు, క్యూలైన్లలో ,గ్యాలరీల్లో అన్నప్రసాదం, పాలు,అల్పాహారం నిరంతరాయంగా పంపిణీ జరుగుతుందన్నారు. తిరుమలలో గదులు లభించని భక్తులు తిరుపతిలో బస చేయాలని కోరారు. బ్రహ్మోత్సవాలకు ముందుగానే సుమారు 7లక్షల లడ్డూలు బఫర్‌స్టాక్ ఉంచుతామన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల,ఆగస్ట్ 24ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో రాష్ట్రమంత్రి కొల్లురవీంద్ర, చిత్తూరు ఎమ్మెల్యే గురజాలజగన్‌మోహన్, తిరపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు దర్శించుకున్నారు..జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్ కుటుంబంతో కలసి శ్రీవారిసేవలో పాల్గొన్నారు.

నల్లమందు డంప్ పేలుడులో దంపతులు మృతి

గంగవరం,ఆగస్టు 24, ప్రభాతవార్త :
రహస్యంగా ఇంట్లో మందుగుండు సామాగ్రిని అక్రమంగా నిల్వ ఉంచడంతో నిశి రాత్రిలో నల్లమందు డంప్ ఆకస్మికంగా పేలుడంతో నాలుగు పాడి ఆవులు దుర్మరణం చెందగా,భర్త,భార్య,కుమారుడు పరిస్థితి విషమంగా మారి,నివాస ఇల్లు ఒక్కసారిగా కుప్పకూలిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలో చోటు చేసుకున్న ఘటన పాఠకులకు విధితమే. తీవ్రంగా గాయపడ్డ దంపతులు ఖాదర్‌బాషా(40),రేహానా(35) దంపతులను ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్య పరీక్షలు చేసిన వైద్యులు పరిస్థితి మరింత విషమంగా ఉండడంతో తిరుపతి రూయాకి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ దంపతులు మృతి చెందినట్లు సిఐ బొడ్డు ప్రసాద్ తెలిపారు. కాగా పసలమందలో శుక్రవారం రాత్రి జరిగిన భారీ ప్రమాదంపై శనివారం జిల్లా అధికారులు స్పందించారు.జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి,అర్బన్ సిఐ బొడ్డుప్రసాద్,తాహశీల్దారు శివకుమార్‌లు సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.టపాకాయలు తయారీ చేయాలన్నా,విక్రయించాలన్నా ప్రభుత్వ అనుమతులు తీసుకొని ప్రజల ఆవాసాలకు దూరంగా నిర్వహించాల్సి ఉంది.కానీ నిర్లక్ష్యం వహించిన ఖాదర్‌బాషా ఇవేమీ పట్టించుకోకుండా తన సోదరుడు రఫీ వద్ద నుండి బారీ ఎత్తున నల్లమందును తెచ్చుకొని తన నివాసంలో అక్రమంగా టపాకాయలు తయారీ చేస్తున్నట్లు అధాకారుల విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో మండలంలోని పలమనేరు,మదనపల్లె రహదారి పక్కన గంగవరం సమీపంలోని గంటే సర్కిల్ వద్ద ఒక గదిలో అక్రమంగా టపాకాయలను నిలువ ఉంచారని సమాచారం రావడంతో సిఐ బొడ్డు ప్రసాద్ సిబ్బందితో కలిసి దాడి చేసి భారీ ఎత్తున టపాకాయలను స్వాధీనం చేసుకున్నారు.

చవితి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 24, ప్రభాతవార్త
వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా పకడ్బందీగా అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సమన్వయంతో జిల్లాలో సజావుగా ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, కోరారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న వరసిద్ధి వినాయక ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు, జెసి శుభం బన్సల్, మేయర్ డా. శిరీష, తిరుపతి మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ నిర్వాహకులు తదితరులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకుందామన్నారు. తిరుపతి నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ వారు టిటిడి సహకార సమన్వయంతో వినాయక నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని, అందరూ సహకరించాలని అన్నారు. గత సంవత్సరం గజ ఈతగాళ్లు సమస్య ఉండిందని కమిటీ సభ్యులు తెలుపగా ఈ సారి అలాంటి సమస్యలు లేకుండా మత్స్యశాఖ అధికారి వారు చర్యలు తీసుకోవాలని సూచించారు. గజ ఈతగాళ్లు తగినంతమంది ఉండేలా చర్యలు తీసుకోవాలని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మనమందరం బాధ్యతగా మట్టి వినాయకులను పూజించి పర్యావరణానికి మేలు కలిగేలా చూడాల్సి ఉంటుందన్నారు. అన్నమాచార్య కీర్తనలు బృందాలను టిటిడి వారు ఏర్పాటు చేయాలని, ఆర్చిలు, పట్టణంఓ పలు ప్రాంతాల్లో డెకరేషన్ లైటింగ్, అరటి తోరణాలు ఏర్పాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ వారు వినాయక సాగర్ నందు తగినంత నీరు ఉండేలా చూసుకోవాలని, శానిటేషన్, క్లోరినేషన్, పారిశుద్ధ్యం చక్కగా ఉండాలని అన్నారు. విగ్రహాల నిమజ్జనం రూట్ వారీగా వారికి డేట్, టైం కేటాయించి సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. మేయర్ మాట్లాడుతూ దాదాపు రెండు దశాబ్దాలుగా శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ వారి సహకారంతో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అధికారులు, అందరు జిల్లా అధికారులు పూర్తి సమన్వయంతో సజావుగా నిర్వహించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సవ న్వయంతో వినాయక మహోత్సవాల ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుంద న్నారు. ఎస్పి మాట్లాడుతూ వినాయక మహోత్సవ కమిటీ నిర్వహణ, నిమజ్జన కమిటీలతో సమన్వయంతో పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పిలు వెంకట్రావు, నాగభూషన రావు, తుడా సెక్రెటరీ వెంకట నారాయణ, ఆర్డీఓ రవి శంకర్ రెడ్డి, జిల్లా పంచాయితీ అధికారిని సుశీల దేవి, తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ప్రతినిధులు సామంచి శ్రీనివాస్, భాను ప్రకాష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, ఆర్సి మునికృష్ణ, మాగంటి గోపాల్ రెడ్డి, గుండాల గోపినాథ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

యాకసిరిలో ఎస్ఎంసి ఎన్నికలు

బహిష్కరించిన తల్లిదండ్రులు

ముచ్చటగా మూడోసారి వాయిదా
పాఠశాల నుంచి విద్యార్థులను తీసుకెళ్లిన వైనం

చిట్టమూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త
చిట్టమూరు మండలం యాకసిరి పంచాయతీలోని ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఎన్నికల్లో అధికార పార్టీ దుశ్చర్యల పట్ల గ్రామానికి చెందిన పిల్లల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు దఫాలుగా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన పాఠశాల సిబ్బంది మూడోసారి సైతం ఎన్నికలను వాయిదా వేయడంపై ప్రతిపక్ష పార్టీలు సైతం తీవ్రంగా విమర్శించాయి. పాఠశాలలో ప్రతిపక్ష పార్టీకి సంఖ్యా బలం ఉన్నప్పటికీ తరచూ ఎన్నికలను వాయిదా వేయడం అధికార పార్టీ అడ్డదారులకు నిదర్శనంగా చెప్పుకోవచ్చని వారు విమర్శించారు. దీంతో విద్యాకమిటీ ఎన్నికలపై విసుగెత్తిన తాము తమ పిల్లలను స్వచ్ఛంధంగా పాఠశాల నుంచి తీసుకెళ్లిపోతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలియజేశారు. యాకసిరి గ్రామంలో ఎస్ఎంసి ఎన్నికల్లో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలపై మండల విద్యాశాఖ అధికారులు సైతం మౌనం వహించడం, కోరం ఉన్నప్పటికీ తరచూ వాయిదాలు వేయడం మంచి పద్ధతి కాదని మండల వైసీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి సైతం ధ్వజమెత్తారు.

చేతివెన్నముద్ద..చెంగల్వ పూదండ..!

రేపు శ్రీకృష్ణజన్మాష్టమి

గరుడగమన
తవ చరణ కమలమివ....

పుంగనూరు,ఆగస్టు 24 ప్రభాతవార్త
శ్రీవారికి అత్యంత ప్రీతికరమైన శ్రావణమాస మూడో శనివారం సందర్భంగా పట్టణంలోని శ్రీకళ్యాణవేంకటేశ్వరస్వామివారికి వైభవంగా ఉత్సవాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అభిషేకం తిరుమంజనం నిర్వహించి, గరుడవాహన భూషితులైన శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను కళ్యాణ మండపంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. అనంతరం సకలాలంకారణ భూషితులైన శ్రీదేవి,భూదేవి సమేత శ్రీకళ్యాణ వేంకటరమణస్వామివారి ఉత్సవమూర్తులను దర్శించుకుని ఉపవాసం వీడడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ పర్యవేక్షకులు మునేంద్రబాబు,అర్చకులు శ్రీనివాసా చార్యులు, శ్రీకాంత్ ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తొట్టంబేడు, ఆగస్టు 24 ప్రభాతవార్త
శ్రీమహావిష్ణువు బ్రహ్మాండాన్ని ఉద్ధరించడానికి హిందూ ఇతిహాసాలలో ఎనిమిదవ అవతారమే శ్రీకృష్ణుడు జన్మదినం. కృష్ణజన్మాష్టమిని 'కృష్ణాష్టమి' అని లేదా జన్మాష్టమి అని గోకులాష్టమి అని అష్టమిరోహిణి అని కూడా పిలుస్తారు. శ్రీకృష్ణుడు దేవకి,వసుదేవులకు ఎనిమిదోగర్భంగా శ్రావణ మాసం కృష్ణపక్షం అష్టమి తిధి రోజు కంసుడు చెరసాలలో జన్మించాడు. చాంద్రమాన పంచాంగం ప్రకారం శ్రావణ బహుళ అష్మటి తిధి. ఇదే రోజు రోహిణి నక్షత్రము కొద్దిసేపు చంద్రాయుక్తమై ఉంటుంది.

పండుగ విధానంః-

కృష్ణాష్టమి నాడు భక్తులు పగలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం శ్రీకృష్ణుని పూజిస్తారు. శ్రావణ మాసంలో లభించే పళ్లు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ స్వామికి నైవేద్యం పెడతారు. ఊయల కట్టి అందులో శ్రీకృష్ణ విగ్రహాల్ని పడుకోబెట్టి ఊపుతూ కీర్తనలను పాడుతారు. పురవీధుల్లో ఎత్తుగా ఉట్లు కట్టి పోటీపడి వాటిని కొడుతారు. అందుకే ఈపండుగను ఉట్లపండుగ లేదా ఉట్లతిరునాళ్లు అని పిలుస్తారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి వ్రతంగా ఆచరిస్తే గోదానం చేసిన ఫలితం, కురుక్షేత్రంలో సువర్ణదానం చేసిన ఫలం దక్కుతుందని బ్రహ్మాండ పురాణం చెప్పింది. కలియుగంలో కల్మషాల్ని హరించి, పుణ్యాల్ని సాధించే పర్వదినం ఇదని కూడా వివరించింది. కృష్ణుడు అనగా నలుపు అని అర్థం. కృష్ణుడు నల్లని రంగు కలవాడని ఐతిహ్యం, ఇంకా ఈపేరుకు అనేక రకాలైన అర్థాలు ఉన్నాయి.

తిరుమల శ్రీవారి ఆస్థానంః-

తిరుమల ఆలయంలో శ్రీనివాసుని పక్కనే రజతమూర్తి శ్రీకృష్ణుని విగ్రహం పూజలందుకుంటూ ఉంటుంది. 11వ శతాబ్దంకు పూర్వమే కృష్ణమూర్తి విగ్రహం ఉన్నట్లు శాసనాధారాలు చెబుతున్నాయి. కృష్ణాష్టమి సందర్భంగా సాయంత్రం సమయంలో శ్రీవారు ప్రత్యేకంగా కొలువుదీరుతారు. ఈకొలువును గోకులాష్టమి ఆస్థానం అంటారు. సర్వాలంకార భూషితుడైన స్వామి సర్వభూపాల వాహనంలో ఆస్థానానికి విచ్చేస్తారు. పౌరాణికులు భాగవత పురాణంలోని శ్రీకృష్ణావతార ఘట్టాన్ని చదివి వినిపిస్తారు. మరునాడు నాలుగు మాడావీధుల్లో ఉట్లపండుగ నిర్వహించడం జరగుతుంది. కృష్ణాష్టకం అనే ప్రార్థనలో కృష్ణుని వర్ణించిన విధానం..దేవకీ వసుదేవుల నందనుడు, కంసచాణూర మర్ధనుడు, నల్లని మేనికాంతి కలవాడు, నెమలిఫించము, వివిధ ఆభరణములు, మందారమాల, పీతాంబరములు, తులసిమాలలు ధరించినవాడు, మెలిదిరిగిన ముంగురులు కలవాడు, రుక్మిణీ సత్యభామాది భామలతో విహరించువాడు, గోపికల కుచముల కుంకుమ అంటిన వక్షస్థలము, శ్రీవత్స చిహ్నాము కలవాడు, వనమాల, శంఖచక్రములు ధరించినవాడు అని చక్కగా వర్ణించాడు. అన్నమయ్య చెప్పిన వర్ణనలో ముద్దుగారే యశోద ముంగిట ముత్యము అంటూ చక్కగా అభివర్ణించారు.

పేరడంలో ప్రభుత్వ భూముల కబ్జా

ప్రేక్షకపాత్ర వహిస్తున్న రెవిన్యూ అధికారులు

సత్యవేడు,ఆగష్టు 24,ప్రభాతవార్త:
తిరుపతి జిల్లా సత్యవేడు మండలం పేరడం గ్రామంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. గ్రామానికి ఎగువభాగంలో ఉన్నప్రభుత్వ భూములపై గ్రామంలో నివసిస్తున్న కొందరు కన్నేశారు. ఈనేపథ్యంలోనే అడవి ప్రాంతానికి సమీపంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అందులో ఉన్న చెట్లను తొలగించి చదునుచేయడంతో పాటు తాత్కాలిక షెడ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే గ్రామానికి ఎగువ భాగాన ఉన్న ప్రభుత్వభూమి ఆక్రమణకు గురైంది. గతంలో తహసిల్దార్ షేక్ జరీనాకు గ్రామస్తులు ఫిర్యాదులు చేసినా అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. ఇదే అదనుగా చేసుకుని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ఎవరికి తోచిన విధంగా ఎవరికి వారు ఆక్రమణలకు గురిచేస్తున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి విషయం తెలిసినా చర్యలు చేపట్టకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు చొరవ చూపి ప్రభుత్వ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దివ్యాంగురాలికి సిఎంఆర్ఎఫ్ కింద 4.50లక్షలు మంజూరు

- ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త రామకుప్పం మండలం సింగసముద్రం గ్రామానికి చెందిన రీఫా అనే దివ్యాంగురాలికి శస్త్ర చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ 4.50లక్షలు మంజూరు అయినట్లు ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. రీఫాకు గత కొన్నేళ్లుగా చెవుడు సమస్య ఉండడంతో ఆపరేషన్ చేయిస్తే రికవరీ చేయవచ్చని వైద్యులు సూచించారన్నారు. దీంతో ఆమె కుటుంబీకులు తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారన్నారు. ఆపరేషన్ నిమిత్తం 4.50లక్షలు మంజూరు కాగా మంజూరు పత్రాన్ని బాధితురాలి కుటుంబానికి ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ అందజేశారు. రీఫా కుటుంబీకులు సిఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కుప్పం ఎంపిడిఓగా సాయి లహరి బాధ్యతలు

కుప్పంరూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త కుప్పం మండల అభివృద్ధి అధికారిగా సాయి లహరి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె శ్రీకాళహస్తి నియోజకవర్గం బుచ్చినాయుడు కండ్రిగ నుంచి ఇక్కడకు డెప్యుటేషన్‌పై బదిలీ అయ్యారు. కుప్పంలో ఎంపిడిఓగా పనిచేస్తున్న ఖాదర్ బాషాను బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి డెప్యుటేషన్‌పై నియమించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రేపు కృష్ణాష్టమి వేడుకలు

కుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త స్థానిక గుడుపల్లె రోడ్‌లో ఉన్న శ్రీ కృష్ణార్జున ఆలయంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయన ధర మకర్త బిఎం దయానిధి తెలిపారు. ఈసందర్భంగా స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణ చేయడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పేదల ఆరోగ్యం పట్ల సిఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ

శాంతిపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త పేదల ఆరోగ్యం పట్ల సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక జూనియర్ కాలేజ్‌లో ఉచిత కంటి వైద్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు పెంచిన వ్యక్తి సిఎం చంద్రబాబు అన్నారు. నాలుగుసార్లు చంద్రబాబును సిఎంను చేసిన కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటున్నారన్నారు. కుప్ప ం ప్రజలకు క ంటి సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కంటి వెలుగు కార్యక్రమంలో ప్రజలకు ఉచితంగా కంటి అద్దాలు, ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమం కుప్పం నియోజకవర్గంలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజులో మరిన్ని ఆరోగ్య, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల కూడా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో మొత్తం 576మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 118మందిని ఆపరేషన్లకు గుర్తించారు. 353మందికి కళ్లద్దాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, డిఐఓ హనుమంతరావు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు సత్యేంద్రశేఖర్, రమేష్, ఎన్డీయే నేతలు, వైద్యులు పాల్గొన్నారు.

కృష్ణమ్మఆలయంలో శ్రావణ శనివారం పూజలు

రామకుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త మండలంలోని ముద్దనపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ కృష్ణమ్మ ఆలయం వద్ద శ్రావణ శనివారం పూజలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ పూజలకు ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ హాజరయ్యారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. గ్రామస్తులు ఏర్పాటుచేసిన సామూహిక వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు చిన్నికృష్ణ, నందారెడ్డి, బాబు, రఫీ, భాస్కరాచారి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

పెద్దపంజాణి, ఆగస్టు 24 ప్రభాతవార్త

ఆటోలో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సహదేవి తెలిపారు. పుంగనూరు పట్టణానికి చెందిన నిసార్ అహ్మద్ తన ఆటోలో అక్రమంగా కర్ణాటక మద్యంను తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. మద్యం, ఆటోను స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

గ్రామకంఠం భూమిని హోంగార్డు ఆక్రమించాడని ఫిర్యాదు

పెద్దపంజాణి, ఆగస్టు 24 ప్రభాతవార్త

మండలంలని పెద్దకాప్పల్లి పంచాయతీ తిప్పిరెడ్డిపల్లి గ్రామంలో హోంగార్డు గ్రామకంఠం భూమిని ఆక్రమించి పునాదులు వేశాడని గ్రామస్తులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామంలో ఏకైక దారి ఉందని ఆదారి గుండానే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నామన్నారు. అయితే గ్రామానికే చెందిన హోంగార్డు ప్రభారెడ్డి అనే వ్యక్తి గ్రామరహదారిలోని గ్రామకంఠం స్థలాన్ని గోతులు తీసి పునాదులు వేసుకుంటున్నాడన్నారు. దీన్ని ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోండంటూ తమపై దౌర్జన్యం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు.

మిన్నంటిన కృష్ణాష్టమి వేడుకలు

పాకాల, ఆగస్టు 24, ప్రభాతవార్త పాకాల స్థానిక పట్టణంలోని ఇన్ఫెంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆడిటోరియంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శ్రీకృష్ణుడి గోపికల వేషధారణలో నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం ఉట్టి కొట్టి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫాదర్ ఆంటోనీ రాజ్ శ్రీకృష్ణుని యొక్క గొప్పతనాన్ని పిల్లలకి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

పుంగనూరు అవినీతి భాగోతాలు వెలికి తీస్తాం

-చిన్నారాయల్, సురేష్‌లకు పవన కళ్యాణ్ హామీ

పుంగనూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త

పదేళ్ళ పాటూ యధేచ్ఛగా ప్రభుత్వ అధికారులను వాడుకుని, కొండగుట్టలను ధ్వంసం చేసి భారీ ఎత్తున అవినీతికి పాల్పడి నియోజకవర్గాన్ని అధోగతిపాలు చేశారని, దీనిపై రాష్ట్రప్రభుత్వం స ్పందించాలని, ముఖ్యంగా పాడిరైతుల సమస్యలపై స్పందించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నా రాయల్, తెలుగుదేశం రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి సోమల సురేష్‌లు రాష్ట్ర ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు విన్నవించారు. శుక్రవారం తిరుపతికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వచ్చిన సందర్భంగా ఏర్‌పోర్టులో చిన్నారాయల్, సోమల సురేష్‌లు ఆయనను కలిశారు. పుంగనూరు నియోజకవర్గం నుంచి వచ్చిన ప్రతినిధులైన ఈ ఇద్దరితో పవన్‌కళ్యాణ్ కొద్దిసేపు మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. పదేళ్ళుగా పాడిరైతులు దారుణమైన దోపిడీకు గురయ్యారని, రిజర్వాయర్లపేరుతో ఊర్లకు ఊర్లు ఖాళీచేయించారని, తిరుపతి నుంచి పుంగనూరు వరకు కనుపించిన వేల ఏండ్లనాటి కొండగుట్టలన్నీ త్రవ్వేశారని, తిరుపతి పరిధిలోని అప్పలాయగుంట సమీపంలో ఇంకా గుట్టలకు గుట్టలు ఖాళీ అయిపోతునే ఉన్నాయని ఫిర్యాదుచేశారు. దీనిపై పవన్‌కళ్యాణ్ స్పందిస్తూ అవినీతి భాగోతాలు వదలిపెట్టే ప్రసక్తేలేదని, ఎంతటి వారైనా సరే మింగిన ప్రభుత్వ ఆస్తులు, ఆక్రమించిన ప్రజల ఆస్తులను కక్కిస్తామన్నారు. ఏరేంజ్‌లదోచేశారోతనకు తెలుసని, త్వరలో కార్యాచరణ ఉంటుందని ఆయన అభయమిచ్చినట్లు తెలిసింది.

అపోలో ఛైర్మన్ ప్రతాప్.సి.రెడ్డి సేవలు ప్రశంసనీయం

తవణంపల్లె, ఆగస్టు 14 ప్రభాతవార్త: అపోలో హాస్పిటల్స్ ఛైర్మన్ పద్మవిభూషణ్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి సేవలు ప్రశంసనీయమని అరగొండ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ఎ.రాజేశ్వ రమ్మ అన్నారు. శనివారం అరగొండ అపోలో సామా జిక సేవా విభాగం సంపూర్ణ ఆరోగ్యపథకం కేంద్రంలో పనిచేస్తున్న పేద చిరుద్యోగి విజయకుమారి కుమార్తె భవ్యశ్రీ వివాహానికి తన వంతు సహాయంగా సుమారు 40 వేల రూపాయలు విలువగల బంగారు తాళిబొట్టును అపోలో ఛైర్మన్ ప్రతాప్.సి.రెడ్డి ఆకుటుంబానికి అందించారు. సంపూర్ణ ఆరోగ్యకేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈతాళిబొట్టును అరగొండ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ఎ.రాజేశ్వరమ్మ, సంపూర్ణ ఆరోగ్యపథ్కం సీఓఓ రాంబాబుల చేతుల మీదుగా విజయకుమారి కుటుంబానికి అందజేశారు. సంపూర్ణ ఆరోగ్యపథకం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బిఆర్‌డి ఆస్పత్రిచే ఉచిత వైద్య శిబిరం

కుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త

మండలంలోని మల్లానూరు, అడవిబూదుగూరు, కొటాలూరు గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థ ం ఆదివారం ఎర్రమన్నుగు ంతలులోని శ్రీ చాముండేశ్వరి ఆలయం వద్ద బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు తెలిపారు. ప్రజలకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు థైరాయిడ్, వరిబీజం, అపెండిక్స్, మొలలు, హెర్నియా, శ్వాస సంబంధిత, కీళ్ల, నరాల సమస్యలు, దంత సమస్యలు, చిన్నపిల్లలకు సంబంధించిన జబ్బులకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రిపుల్‌ఐటికి విద్యార్థిని ఎంపిక

రామకుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త

మండలంలోని చెల్దిగానిపల్లి హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న చతుర్నిక అనే విద్యార్థిని ట్రిపుల్‌ఐటికి ఎంపికైంది. పదవ తరగతిలో 564మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఇడుపుల పాయ ట్రిపుల్ ఐటికి ఎంపికైంది. దీంతో ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

బృందావన్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

చిత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త: చిత్తూరుపట్టణం, సంతపేట నందుగల బృందావన్ పాఠశాల నందు ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ శైలజకుమారి తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు బాలకృష్ణుడు, యశోద, గోపికలుగా వివిధ వేషధారణలో పాఠశాలకు హాజరై అందరినీ ఆకట్టుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గౌరవ డాక్టరేట్ అందుకొన్న ఎల్ఐసి ఏజెంట్ గిరి

చిత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:

నిస్వార్థంగా సామాజిక సేవ చేస్తున్న చిత్తూరు నగరానికి చెందిన ఎల్ఐసి ఏజెంట్ గిరికి బెంగళూరుకు చెందిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఆఫ్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. శనివారం ఉదయం బెంగళూరు నగరంలోని భారత్ వర్చువల్ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్స వంలో కమాండర్ ఇన్ చీఫ్ ఆర్టీ కల్నల్ కౌశిక్ విశాల్, యూనివర్సిటీ ఛైర్మెన్ డాక్టర్ ఎంఎం హామీద్, డీన్ టిఎన్ స్వామినాధన్ చేతుల మీదుగా అందుకొన్నారు. గత 20సంవత్సరాలుగా వేలాదిమంది పేదలకు అన్నదానం చేయడంతో పాటు కరోనా మహమ్మారి ప్రబలిన సమయంలో చేసిన సమయంలో చేసిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం ఎంతో సంతోషంగా వుందన్నారు. కాగా డాక్టరేట్ అందుకొన్న గిరికి కుటుంబసభ్యులు, స్నేహితులు, ఎల్ఐసి కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఏజెంట్లు అభినందించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పాకాల, ఆగస్టు 24, ప్రభాతవార్త

పాకాల స్థానిక పట్టణంలోని స్కై లైన్ ఆక్స్‌ఫోర్డ్ స్కూల్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శ్రీకృష్ణుడి గోపికల వేషధారణలో నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం ఉట్టికొట్టి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాలకూరి నాగేంద్ర శ్రీకృష్ణుని యొక్క గొప్పతనాన్ని పిల్లలకి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

మానవతావాది గువ్వల రామకృష్ణారెడ్డి

చౌడేపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త

దివంగత గువ్వల రామకృష్ణారెడ్డి మానతావాదని పలువురు తేదేపా నాయకులు కొనియాడారు. మాజీ జడ్పీటీసీ, బోయకొండ మాజీ ఛేర్మన్ గువ్వల రామకృష్ణారెడ్డి 4వ వర్ధంతిని పురష్కరించుకొని తేదేపా ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బస్టాండులో ఆయన చిత్ర పటానికి పూలమాలలేసి సేవలను గుర్తు చేసారు. గువ్వల రామకృష్ణారెడ్డి నిజాయితీ, నిబద్ధత, ముక్కుసూటితత్వం నేటి తరానికి ఆదర్శమన్నారు. అనంతరం అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. తేదేపా నాయకులు ఆవుల రామచంద్రయ్య, బోయకొండ సుబ్బు, జంపాల శ్రీనివాసులు, పవన్‌కుమార్, రెడ్డిప్రసాద్, అర్జున్, నాగరాజరెడ్డి, గనీ, కళ్యాణ్, మురళి, మునిరాజ, ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

44 లీటర్ల నాటుసారా స్వాధీనం

- ఇద్దరు నిందితులు అరెస్టు

గుడిపాల, ఆగస్టు 24 ప్రభాతవార్త:

మండల పరిధిలో శనివారం 44 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామ్మోహన్ వెల్లడించారు. మండల పరిధిలోని గుర్రాలమిట్ట గ్రామంలో బెంజిమన్ అనే వ్యక్తి నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్ళి తనిఖీలు నిర్వహిస్తే బెంజిమన్ ఇంటి ఆవరణలో 32 లీటర్ల నాటు సారా లభ్యమైందని, ఈ మేరకు నాటు సారాలను స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. అలాగే తిమ్మాయపల్లిలో ఎడ్విన్ అనే వ్యక్తి నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో వెళ్ళి తనిఖీలు నిర్వహిస్తే 12 లీటర్ల నాటు సారా పట్టుబడిందని ఈ మేరకు ఎడ్విన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

- అధికార పార్టీ నాయకుల దుశ్చర్యలపై ప్రతిపక్షం మండిపాటు

చిట్టమూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త

చిట్టమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. అధికారులు, ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల మధ్య వాదోపవాదాలు చోటుచేసు కున్నాయి. మండల పరిషత్ అధ్యక్షురాలు సన్నారెడ్డి విజయలక్ష్మి అధ్యక్షతన ఎంపిడిఓ షాలెట్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంపై ఉపాధ్యక్షుడు బివి రమణయ్య, జడ్పిటిసి చిప్పల వెంకటయ్య, బురద గాలికొత్తపాలెం సర్పంచ్ యర్రబోతు మణి, ఆలేటిపాడు సర్పంచ్ హరనాథ్ తదితరులు ధ్వజమెత్తారు. అధికారులే సర్వసభ్య సమావేశాలకు హాజరుకాకపోతే సమస్యలెలా పరిష్కారమవుతాయని నిలదీశారు. ఆలేటిపాడులో ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో చోటుచేసుకున్న రాజకీయ కుక్రీడపై ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు ఏపీఓ చిన్నయ్యను నిలదీశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు బివి రమణయ్య మాట్లాడుతూ చిట్టమూరు మండలంలో అన్యాక్రాంతమైన భూములను గుర్తించి నిరుపేదలకు పంచాలని తహశీల్దార్ ఐవి ప్రసాద్‌కు సూచించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే ఇటీవల జరిగిన ఎస్ఎంసి ఎన్నికల్లో అధికార పార్టీ నాయకుల పెత్తనానికి తోడు అధికారులు సైతం వారికి తొత్తులుగా వ్యవహరించి దొడ్డిదారిన ఛైర్మన్ పదవులను దక్కించుకోవడం సిగ్గుచేటన్నారు. అలాగే చిరుద్యోగులైన ఫీల్డ్ అసిస్టెంట్లు, విఓఎలను తొలగించడం అన్యాయమని, గ్రామ పంచాయతీ తీర్మానంతోనే ఈ నియామకాల ప్రక్రియ చేపట్టాలని ఎంపిడిఓ షాలెట్‌కు సూచించారు. మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ రానున్న సీజన్ వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలనిసూచించారు. మండలఅధికారులతోపాటుప్రజాప్రతినిధులు, పంచాయతీకార్యదర్శులుపాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం ఇస్తాం

- ఆర్డీఓ కిరణ్‌కుమార్

కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త

కోట మండలం కొత్తపట్నం పంచాయతీ పరిధిలో 457 ఎకరాలు ప్రభుత్వ భూములకు సంబంధించి గత నెలలో సర్వే పూర్తి చేశారు. ఆ మేరకు శనివారం కొత్తపట్నంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో భూములకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను ప్రకటించారు. దీంతో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అర్జీల రూపంలో ఇస్తే పరిశీలిస్తామని అధికారులు చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు అందరికీ పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్‌కు (చెన్నై-బెంగళూరు) భూమి అవసరమని చెప్పారు. గ్రామసభలో ఏపీఐఐసి జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, తహశీల్దార్ జయజయరావు, ఎంపిడిఓ భవాని, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ హేమంత్‌కుమార్, మండలస్థాయి అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త

కోట మండలం కొండుగుంట గ్రామ చెరువు మలుపు వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో గోపాలయ్య అనే వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. వాకాడు మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన గోపాలయ్య కుమార్తె పవిత్ర ఎంబిబిఎస్ పూర్తి చేసి సర్టిఫికెట్ల కోసం విజయవాడకు వెళ్లారు. తిరిగి రైల్లో గూడూరుకు చేరుకున్నారు. గూడూరు నుంచి ఆఖరి బస్సు కోటకు లేకపోవడంతో ఫోన్ చేసి గోపాలయ్య అన్నకుమారుడు సందీప్‌ను ద్విచక్ర వాహనం తీసుకురమ్మని చెప్పారు. దీంతో సందీప్ గూడూరుకు వెళ్లి గోపాలయ్యతో పాటు పవిత్రను వెంటబెట్టుకొని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణంలో కొండుగుంట వద్దకు చేరుకోగా, కోట వైపు నుంచి వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపాలయ్య చికిత్స పొందుతూ మృతిచెందారు. గోపాలయ్య కుమార్తె పవిత్ర స్వల్పగాయాలతో బయటపడగా, సందీప్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటంబేడుకుప్పం ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీ ఎన్నిక

తడ, ఆగస్టు 24 ప్రభాతవార్త

గతంలో వాయిదా పడిన తడ మండలం వాటంబేడుకుప్పం ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీ ఎన్నిక శనివారం జరిగింది. కమిటీ ఛైర్మన్‌తో పాటు వైస్ ఛైర్మన్‌ను కూడా ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా వరదయ్యపాలెం ఎంఇఓ ఎస్.గుణయ్య, బుచ్చినాయుడుకండ్రిగ జడ్పి హైస్కూల్ హెచ్ఎం కె.రమణయ్యలు వ్యవహరించారు. ఈ కమిటీ ఛైర్మన్‌గా బుస్సం సింధు, వైస్ ఛైర్మన్ బుజ్జయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులతో పాటు వాటంబేడుకుప్పం పెద్దలు బొమ్మన్ శ్రీధర్, పళణి, ఏకాంబరం, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మాంబట్టు సెజ్ రోడ్డులో 11 మద్యం బాటిళ్లు స్వాధీనం

తడ, ఆగస్టు 24 ప్రభాతవార్త

తడ మండలం మాంబట్టు సెజ్ మెయిన్ రోడ్డులో అపాచి కంపెనీ గేటు ఎదురుగా శనివారం పోలీసులు 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్ ఎస్ఐ రాఘవయ్య ఆధ్వర్యంలో తనిఖీ చేస్తుండగా కాదలూరుకు చెందిన పాలా మునిశేఖర్ మోటార్‌సైకిల్‌లో తీసుకెళుతున్న మూడు రకాల బ్రాండ్లకు చెందిన 11 మద్యం సీసాలను పట్టుకున్నారు. ఈ మద్యం బాటిళ్లను అధిక ధరలకు విక్రయించడానికి తీసుకెళుతున్నట్లు గుర్తించామని పోలీసులు చెప్పారు. ఈ కేసులో మోటార్‌సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి

గూడూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త

జాతీయ అంతరిక్ష దినోత్సవ సందర్భంగా గూడూరు పట్టణంలోని రమణమ్మ మహిళా కళాశాలలో భారత ప్రభుత్వం ఫోటో ఎగ్జిబిషన్ 23వ తేది నుండి 25వ తేది వరకు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రెండవ రోజు స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి విద్యార్థినీలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచారం మంత్రిత్వ శాఖ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి మాట్లాడుతూ చంద్రయాన్ ప్రయోగం సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆగస్టు 23వ తేది భారత ప్రభుత్వం అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటుందని తెలిపారు. మొదటి అంతరిక్ష దినోత్సవ సందర్భంగా గూడూరులోని డిఆర్‌డబ్ల్యూ మహిళా కళాశాలలో మూడు రోజుల పాటు ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. దీని ద్వారా అంతరిక్ష విశేషాలు, శాస్త్రవేత్తల పరిశోధనలు ప్రతి ఒక్కరు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను తీసుకువచ్చి ఎగ్జిబిషన్ తిలకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

గూడూరు రెండో పట్టణ సిఐగా శ్రీనివాస్

గూడూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త

గూడూరు రెండవ పట్టణ సిఐగా శ్రీనివాస్ శనివారం గూడూరు రెండవ పట్టణ పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పనిసరి అని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. నేరాల నియంత్రణకు కృషి చేస్తామన్నారు.

గ్రామ స్వరాజ్యం స్థాపనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

గూడూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త

గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభలు విజయవంతం కావడం కూటమి ప్రభుత్వ మొదటి విజయమని జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు తెలిపారు. గూడూరు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పంచాయితీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సారి జరిగిన 13326 గ్రామ సభలు విజయవంతం కావడంతో జాతీయ స్థాయిలో ప్రశంసలు దక్కాయన్నారు. తమ తమ గ్రామాల సమస్యల పరిష్కారాల కోసం ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయం, ఆలోచన, కార్యచరణ మేరకు దశాబ్దాల తర్వాత రాష్ట్రంలోని కొన్ని వేల గ్రామాలలో జరిగిన గ్రామ సభల విశిష్టత, ప్రాధాన్యం, సాధికారతను నేటి యువత, ప్రజలు తెలుసుకోవడం జరిగిందన్నారు. గ్రామ సభలలో గ్రామాల సమస్యలు, పరిష్కారం మాత్రమే కాదు, చేపట్టిన అభివృద్ధి పనుల లిస్టును పంచాయితీ కార్యాలయంతో పాటు, ప్రముఖ కూడలిలో కనిపించేలా బోర్డులు పెట్టాలని, ఏదైనా అభివృద్ధి గురించిన అంశంలో లోటుపాట్లు జరిగితే, వెంటనే సదరు అభివృద్ధి కార్యక్రమం చేసిన కాంట్రాక్టర్ల గ్రామాల ప్రజలు నిలదీసేలా ఉండాలని, అప్పుడే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో పిఓసి మోహన్, నాయకులు నాగార్జున, ఇమ్రాన్, సాయి కిరణ్, హరి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



బాలాయపల్లి, ఆగస్టు 24, ప్రభాతవార్త స్థానిక వరసిద్ధి వినాయక ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు వేషం ధరించి చేసిన నృత్య ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ముకుందా ముకుందా అంటూ చిన్నారులు భక్తి గీతాలు ప్రదర్శన నిర్వహించారు. శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు చేసిన మిత్రులు అందర్నీ ఆకట్టుకున్నాయి. చిన్నారులకు కరస్పాండెంట్ శంకరమ్మ, ప్రిన్సిపల్ జయలక్ష్మి బహుమతులు అందజేశారు.

టిడిపి నేతల అరాచకాలను న్యాయబద్ధంగా ఎదుర్కొంటాము

వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, ఆగస్టు 24, ప్రభాతవార్త

పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి నేతలకు తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో రాంకుమార్ రెడ్డిని పలువురు నాయకులు కలిశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు తమను పలు రకాలుగా ఇబ్బంది పెడుతున్నట్లు రాంకుమార్ రెడ్డికి తెలిపారు. టిడిపి వారి అరాచకాలను న్యాయబద్ధంగా ఎదుర్కొంటామని చెప్పారు. ఎవరు అధైర్య పడవద్దు ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాలయ్య, కౌన్సిలర్లు సుబ్బారావు, గోపాలకృష్ణ, పూజారి లక్ష్మి, వహిదా, వెందోటి కార్తిక రెడ్డి, వెంకటేశ్వర్లు, పోల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎల్వి రమణ బాబు జన్మదిన వేడుకలు

గూడూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త

మైథిలీ హాస్పిటల్ నర్సింగ్ కళాశాల అధినేత ఎల్వి రమణబాబు జన్మదినం సందర్భంగా పట్టణంలోని మైథిలీ హాస్పిటల్ ఆవరణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మృదు స్వభావి మంచి వ్యక్తిత్వం కల్గిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మైథిలి, మన్విత హాసిని, సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అధికారులు పనిచేయండి

వాకాడు, ఆగస్టు 24, ప్రభాతవార్త

పార్టీలకు అతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయబద్ధంగా పనిచేయాలని కొడవలూరు దామోదర్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం వాకాడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని స్త్రీ శక్తి భవనంలో సాధారణ సర్వసభ సమావేశం ఎంపిపి కొడవలూరు అనసూయమ్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ మూడు నెలల్లో ఎన్నో అరాచకాలు చూస్తున్నామని సందర్భంగా ఆయన తెలిపారు. అదే విధంగా వైసిపి పాలన అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగస్తులు జోలికి వెళ్లలేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మండలంలో ఎల్ఆర్‌జిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లని తీసివేయడం జరుగుతుందని ఆయన ఎద్దేవా చేశారు. వైసిపి పాలనలో ఏ ఒక్కరిని తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో తీసివేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకటరమణయ్య, నిర్మల, ఎంపిడిఓ వెంకటేశ్వర రావు, తహశీల్దార్ రామయ్య, ఎంపిటిసి కృష్ణారెడ్డి, సర్పంచులు అనిల్ కుమార్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుకకు అధిక ధరలు వసూలు చేస్తే ఫిర్యాదు

చిత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త: నూతన ఇసుక విధానంకు సంబంధించి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్, టిప్పర్ యాజమానులు, డ్రైవర్లు ఎవరైనా ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే అధిక ధరలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ట్రాక్టర్, టిప్పర్ యాజమానులు వినియోగదారుల నుండి అధిక ధరలు వసూలు చేస్తే చిత్తూర్‌శాంత్75జిమెయిల్.కామ్ లేదా 08572-299509 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

మునివెంకటప్ప సేవలు మరపురానివి : వెంకట్రెడ్డి

పుదిపట్ల(చౌడేపల్లి), ఆగస్టు 24 ప్రభాతవార్త

మాజీ ఐఎఎస్ అధికారి, ప్రిన్సిపుల్ కార్యదర్శి మునివెంకటప్ప సేవలు మరపురానివని పరివర్తనా సమితి వ్యవస్థాపక అధక్యుడు, ఎస్వీయూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫసర్ వెంకట్రెడ్డి అన్నారు. శనివారం మునివెకటప్ప వర్ధంతి సందర్భంగా స్థానిక ఎస్సీ వసతిగృహంలో ఆయన సంస్మరణ సభ జరిగింది. కుల, మతాల కతీతంగా మునివెంకటప్ప చేసిన సేవలు ప్రజలు నిత్యం స్మరిస్తూనే వున్నారన్నారు. వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి ప్రిన్సిపుల్ సెక్రటరీగా ఎదిగిన మునివెంకటప్ప దళితుల అభివృద్ధి కోసం అహర్ని శలూ శ్రమించారన్నారు. అనంతరం ఆయన సమాజానికి చేసిన సేవలను వివరించారు. టి.ముని వెంకటప్ప మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 300మంది విద్యార్థులకు విద్యావుపయోగకర ప్యాడ్‌ల నందించారు. అదే విధంగా పులగూరకోట మంజునాథ్ అంబేద్కర్ భవనానికి రూ. 25వేలు విలువ చేయు సౌండ్ సిస్టంను విరాళంగా అందించారు. విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారిణి గౌతమి, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడుయమలాసుదర్శనం, ఆర్‌పిఐ అధ్యక్షుడు రవి, జనశ్రీ సొసైటీ రమణ, యమలా చంద్రయ్య, బ్యాంకు రెడ్డెప్ప, చింతపర్తితాతయ్య, వార్డన్లుసురేష్, దీపా, వెంకట్రమణ, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఐఐటీ పోటీల్లో శేషశాయి విద్యార్థుల హవా

పుత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:

తిరుపతి ఐఐటీ వాళ్లు స్పేస్ వేడుకలు పురస్కరించుకుని డ్రాయింగ్, క్విజ్, వైజ్ఞానిక ప్రదర్శనలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 1200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో శేషశాయి విద్యార్థులు కూడా పాల్గొన్నారు. వీరిలో గెలుపొందిన ఫలితాలను శనివారం ప్రకటించారు. వీరిలో 9వ తరగతి చదువుతున్న యశ్వని డ్రాయింగ్ ద్వితీయ బహుమతిని, 7వ తరగతి చదువుతున్న వెంకట సహిష్ణు వైజ్ఞానిక ప్రదర్శనలో రెండో బహుమతిని కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డైరెక్టర్ రమేష్, సన్నద్ధత చేసిన కరస్పాండెంట్ ఎం.ఎస్.ఇంద్రజిత్, ఏఎస్వో భానుమూర్తి, వి.ఏసుపాదం, కె.ఎస్.మహాలక్ష్మి ఎంతో కృషి చేశారు.ఏ.సుబ్బయ్య, డి.జయప్రకాష్, కె.మనోజ్, ఎస్.శారద నరసింహన్ గెలుపొందిన బహుమతులు అందుకున్న విద్యార్థులను అభినందించారు.

శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో వన మహోత్సవం

తిరుపతి విద్య, ఆగస్టు 24, ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం వన మహోత్సవం కార్యక్ర మాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ పర్యవేక్షణలో కళాశాల జాతీయ సేవా పథకం అధికారులు, విద్యార్థిని విద్యార్థులు కళాశాల ఆవరణలోని ఇంజినీరింగ్ విభాగం పరిసరాల్లో మొక్కల్ని నాటారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థులు నిర్వహించే సేవా కార్యక్రమాలు సమాజానికి మేలు జరిగేలా ఉండాలని సూచించారు. వ్యవసాయ విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థి కళాశాల ఆవరణలో ఒక మొక్క నాటే సంప్రదాయాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వన మహోత్సవం కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ శైలజ, డాక్టర్ శాంతి, డాక్టర్ గణేష్ కుమార్, డాక్టర్ రమణ మూర్తి పాల్గొన్నారు.

భాష్యంలో ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు

తిరుపతి విద్య, ఆగస్టు 24, ప్రభాతవార్త

స్థానిక ధనలక్ష్మి నగర్‌లోని భాష్యం లిటిల్ చాంప్స్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి సంబరాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆనాటి బృందావనాన్ని తలపించేలా శనివారం భాష్యం విద్యా సంస్థల్లో కృష్ణాష్టమి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు శ్రీ కృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలో వివిధ పాటలకు నృత్యాలు వేయడం జరిగింది. శ్రీ కృష్ణుడి వేషంలో వచ్చిన విద్యార్థులచే ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు

తిరుపతి విద్య, ఆగస్టు 24, ప్రభాతవార్త

శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో తెలుగు, సంస్కృతం విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయని కళాశాల ప్రిన్సిపల్ డా. బి. సత్యనారాయణ తెలిపారు. కళాశాలలోని తెలుగు, సంస్కృతం విభాగాల వారు శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలను నిర్వహించారు. బహుమతి ప్రధాన కార్యక్రమానికి ఏర్పాటు చేసిన సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. సత్యనారాయణ శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా శ్రీకృష్ణుని యొక్క వైభవాన్ని, శ్రీకృష్ణుని లీలావిశేషాలను విద్యార్థులను వివరించారు. అలాగే కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి. పరమేశ్వర మాట్లాడుతూ శ్రీకృష్ణుని ఆదర్శగుణాలను విద్యార్థులకు అన్వయిస్తూ సందేశానిచ్చారు. తెలుగు విభాగాధిపతి డా.ఎం. మాదన్న శ్రీకృష్ణుని పుట్టుకను, లీలలను చక్కగా వివరించారు. సంస్కృతం అధ్యాపకుడు డా. కే. కోటేశ్వరయ్య, తెలుగు అధ్యాపకులు డా.జె. కొండలరావు, డా.పి.శివకుమార్, డా.ఎస్. వసంత కుమారి, విద్యార్థులకు మంచి సందేశాన్ని అందించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

భాష్యం పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

తిరుపతి విద్య, ఆగస్టు 24, ప్రభాతవార్త

స్థానిక వరదరాజు నగర్ శ్రీపురం కాలనీలో ఉన్న భాష్యం పాఠశాలలో జోనల్ ఇన్చార్జి లక్ష్మణ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలతో అందరిని అలరించారు. మొదటిగా శ్రీకృష్ణ పూజ నిర్వహించి అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుని గీతాలతో, నృత్యాలతో, శ్రీకృష్ణ నామస్మరణలతో రెండు రోజుల ముందుగానే పండుగ వాతావరణం నెలకొంది. పాఠశాల మొత్తం శ్రీ కృష్ణ దేవాలయంగా మారి అందరినీ ఆకట్టుకుంది. తర్వాత ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు పోటీలు పడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాలాజీ, లిటిల్ చాంప్స్ ఇంచార్జి సుధాకుమారి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే చిన్నారులు పండుగ విశిష్టతను తెలుసుకోవాలి

తిరుపతి విద్య, ఆగస్టు 24, ప్రభాతవార్త

స్థానిక బైరాగిపట్టెడలో ఉన్న సోక్రటీస్ పాఠశాలలో శనివారం ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని చిన్నారులు రాధా, గోపికల, కృష్ణల వేషధారణలో అందరినీ అలరించారు. తర్వాత పాటలు, నాట్యాలతో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. అనంతరం కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చిన్నారులకు పండుగ విశిష్టతను తెలిపేందుకు ఈ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

తిరుపతి విద్య, ఆగస్టు 24, ప్రభాతవార్త

స్థానిక మంగళంలోని నారాయణ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఐ వసంత్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కృష్ణాష్టమి విశేషాల గురించి కృష్ణుడు యొక్క గొప్పతనాన్ని మానవ జాతికి చేసిన సేవలను కొనియాడారు. ప్రిన్సిపాల్ అంసవేణి మాట్లాడుతూ శ్రీ కృష్ణుడు భగవద్గీతను బోధించిన విధానాన్ని గురించి వివరించారు. శ్రీ కృష్ణుని వైభవాన్ని తెలియజేసి భాగవతం, బగవద్గీతలను గురించి తెలుసుకోవాలన్నారు. కలియుగంలో కల్మషాన్ని హరించి పుణ్యాన్ని ప్రసాధించే పర్వదినం ఇది అని కూడా వివరించారు. విద్యార్థులు రాధాకృష్ణుడు వేషధారణలతో ఆటపాటలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ ద్రాక్షాయని, తహసీన్, అకడమిక్ డీన్ వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ భవ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంలో పెద్ద కాలువల్లో వ్యర్థాలు తొలగింపు

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 24, ప్రభాతవార్త

తిరుపతి నగర పాలక పరిధిలో జరుగుతున్న పెద్ద కాలువల్లో పూడికలు పనులు త్వరగా తొలగించాలని ఇంజనీరింగ్, హెల్త్ అధికారులను నగర మేయర్ డాక్టర్ శిరీష ఆదేశించారు. తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని జరుగుతున్న చిన్న ,పెద్ద మురుగుకాలువల్లో పూడిక పనులను తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. శనివారం ఉదయం 27వ డివిజన్ పరిధిలోని హెడ్ పోస్ట్ ఆఫీస్, గంగమ్మ గుడి ఆర్చ్ వద్ద కాలువల్లో పూడికలను త్వరగా తొలగించాలని ఇంజనీరింగ్, హెల్త్ అధికారులను ఆదేశించారు. మీడియాతో మేయర్ మాట్లాడుతూ ముందస్తు చర్యలుగా రాబోయే వర్షాకాలంలో ఎక్కడ కాలువల్లో నీరు నిలవకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా 90 లక్షల రూపాయిలు వ్యయంతో నగర పాలక పరిధిలోని చిన్న కాలువలు, పెద్ద కాలువల్లో సీల్ట్ వ్యర్థాలు తొలగిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ఉండాలని కోరారు. ప్రతి రోజు నగర పాలక ఇంటి వద్దకే వాహనాలు వస్తున్నాయని, తడి చెత్త, పొడి చెత్త వేరు వేరు చేసి సిబ్బందికి అందించాలని, అలాగే ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ నిషేధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు శానిటరీ సూపర్వైజర్ సుమతి, డిఈ రాజు, సచివాలయ సిబ్బంది గోపాలకృష్ణ, పల్లవి, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు పూజా సామగ్రి వితరణ

రేణిగుంట, ఆగస్టు 24 ప్రభాతవార్త:

గీతా చార్యుడు, కర్మయోగి, మర్మయోగి, పురాణ పురుషుడు, పుట్టిన రోజు శ్రీకృష్ణ జన్మాష్టమి (గోకులా ష్టమి) పర్వదినాన్ని పురస్కరించుకుని రేణిగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర దేవస్థానం వద్ద శనివారం సాయంత్రం యాదవ హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్, బీజేపీ యువ నాయకులు పూల వెంకటాద్రి యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భక్తులకు పూజా సామగ్రి వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ యావత్ ప్రపంచం ఆరాధిస్తున్న పురాణ పురుషుడిగా శ్రీకృష్ణ పరమాత్మను అభివర్ణించారు. గీతా సారాంశాన్ని పాఠ్యాంశాలుగా అమలు పరిస్తే దేశం శాంతియుతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రమణ యాదవ్, అన్బి యాదవ్, శీను యాదవ్, చిరంజీవి యాదవ్, శ్రీరామ్ యాదవ్, చందు, బాలాజీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులప్రదర్శన ర్యాలీ

రేణిగుంట, ఆగస్టు 24 ప్రభాతవార్త:

కోల్‌కత్తా జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటనకు నిరసనగా తిరుపతి జిల్లా ప్రైవేటు టీచరు లెక్చరర్స్ ఫెడరేషన్ రేణిగుంట పట్టణంలో శనివారం అంబేడ్కర్ సర్కిల్ నుంచి బస్టాండ్ గాంధీ బొమ్మ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పాండు మాట్లాడుతూ బాధితురాలి కుటుంబానికి త్వరగా న్యాయం జరిగేలా చూడాలని, ఇటువంటి ఘటనలు జరగకుండా కొత్త చట్టాలను తీసుకురావాలని న్యాయస్థానాలకు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు మానవతా విలువల గురించి నేర్పించాలని కోరారు. ర్యాలీలో జిల్లా ప్రెసిడెంట్ అశోక్‌నాయుడు, వైస్ ప్రెసిడెంట్ కరాటే కుమార్, రాజు, బాబులాల్, సాలెహ, రియాజ్, సమీవుల్లా, గాబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు గోకులాష్టమి

పుత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం గోకులాష్టమి వేడుకలు ఏజీఎం సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. విద్యార్థులు శ్రీకృష్ణ వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో జోనల్ డీన్ మోహన్, జ్యోతి, వరదారెడ్డి పాల్గొన్నారు.

ముందస్తు జేబీఆర్ విద్యాసంస్థలో శ్రీకృష్ణ జన్మదిన వేడుకలు

పిచ్చాటూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త:

పిచ్చాటూరు మండలకేంద్రంలో కొలువైన ప్రముఖ విద్యాసంస్థ జేబీఆర్ పాఠశాలలో ఆ సంస్థల అధినేత జేబీఆర్ డా. మునిరత్నం ఆధ్వర్యంలో 26న శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ముందస్తుగా శ్రీకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణ వేషధారణలతో చక్కటి నృత్య ప్రదర్శనలతో అలరించిన పిల్లల నైపుణ్యంను వెలికి తీయడం కోసం ఇలాంటి కార్యక్రమాలను మా సంస్థ నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భూలక్ష్మి, ఏవో అంకయ్య, ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తా - తహసీల్దార్ కిరణ్

విజయపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త:

గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తహసీల్దార్ కిరణ్ పేర్కొన్నారు. శనివారం విజయపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టూరు గ్రామంలో సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామస్తులంతా కలసికట్టుగా పరిష్కరించేందుకు ఇటువంటి గ్రామసభ నిర్వహించడం చాలా సంతోషమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు చుక్కా ధనంజయ యాదవ్, ఈవోపీఆర్డీ సురేంద్ర కుమార్, సర్వేయర్ శేఖర్, మాజీ సర్పంచ్ జయరామరాజు, స్థానిక నాయకులు మురళి, చెంచయ్య, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పీఠం పీఠాధిపతికి ఘన స్వాగతం

ఏర్పేడు, ఆగస్టు24, ప్రభాతవార్త;

భువనేశ్వరి పీఠం పీఠాధిపతి శ్రీశ్రీ కమలానంద భారతి తిరుమల పర్యటన సందర్భంగా శనివారం మార్గమధ్యంలోని ఏర్పేడు నందు స్వామివారికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నైనారు పున్నారావు, సీనియర్ పార్టీ నాయకులు చంద్రారెడ్డి, పార్లమెంట్ బీసి ఉపాధ్యక్షులు రాచేటి సుబ్రమణ్యం, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, మండల పార్టీ నాయకులు బాలాజి గోల్డ్‌మెన్ నాయుడు ఘన స్వాగతం పలికి శాలువ కప్పి సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈకార్యక్రమంలో పలువురు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రిని సత్కరించిన టిడిపి అధికార ప్రతినిధి

ఏర్పేడు, ఆగస్టు24, ప్రభాతవార్త;

రాష్ట్ర ఎక్సైజ్ మరియు భూగర్భ గనుల శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర తిరుమల పర్యటన నిమిత్తం వచ్చి శనివారం తిరుగు ప్రయాణంలో రేణిగుంట విమానాశ్రయంలో టిడిపి అధికార ప్రతినిధి ఆయనను కలసి శాలువతో సత్కరించి ఆయనతో ప్రత్యేకంగా భేటిఅయినూతనమద్యంపాలసిప్రజలకు అనుకూలంగా ఉండాలని కోరినట్లు తెలిపారు.

అధికారులతో సమీక్ష సమావేశం

విజయపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త:

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల అధికారులతో ఎంపీడీవో చంద్రమౌలి సమస్యలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు.. ఏఈ, ఏపీఎం, ఏపీవో, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వర్క్ ఇన్స్పెక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సమావేశం నిర్వహించి సమస్యలపై సమీక్షించారు. ప్రతి ఒక్కరూ గ్రామీణ అభివృద్ధిపై దృష్టి మళ్లించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం చేయండి - వ్యవసాయ సంచాలకులు నాగపద్మిణి

విజయపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త:

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి మళ్లించాలని చిత్తూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగపద్మిణి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కాళికాపురంలోరైతులకు ప్రకృతి వ్యవసాయం, వాతావరణ ఆధారిత వ్యవసాయం,భూసార పరీక్షలు, ఎరువుల వాడకంపై శిక్షణ సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. వరి, వేరుశనగ, మిరప పంటలో తెగుళ్ళ నివారణ, సస్యరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త సంధ్యారాణి, మండల వ్యవసాయాధికారిణి రజనీకుమారి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి శనివారం 'భోగ్ బండారో' కార్యక్రమం

తిరుపతిరూరల్, ఆగస్టు24 ప్రభాతవార్త:

శ్రీస్వామి హథీరాంజీ బావాజీ ఆలయ నిర్మాణాన్ని పురస్కరించుకుని ప్రతి శనివారం 'భోగ్ బడారో' కార్యక్రమాన్ని నిర్వహస్తున్నట్లు శ్రీహథీరాంజీ బావాజీ ఆలయ ధర్మకర్త శివ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బంజరాల ఆరాధ్యదైవమైన హథీరాంజీ బావాజీ ఆలయాన్ని తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలోని విద్యుత్ నగర్‌లో బావాజీ ఆలయం నిర్మితమైతున్న విషయం తెల్సిందే. భోగ్ బండారు కార్యక్రమంలో సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే మొట్టమెదటి శ్రీహథీరాంజీ బావాజీ ఆలయాన్ని నిర్మిస్తున్నామని, దాతలు విరివిగా విరాళాలు అందించాలని కోరారు.

బడి సుధాయాదవ్‌కు డాక్టరేట్ ప్రదానం

తిరుపతిరూరల్, ఆగస్టు24 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలం పుదిపట్ల గ్రామ సర్పంచ్ బడి సుధాయాదవ్‌కు బెంగళూరు 'భారత్ వర్చువల్ యూనివర్శిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బడి సుధాయాదవ్ 20సంవత్సరాలుగా మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆశీస్సులతో రాజకీయ రంగప్రవేశం చేసి, రాజకీయాలతో పాటు వివిధ బడి సామాజిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు. సుధా యాదవ్ సేవలను గుర్తించి బెంగళూరులో వున్న 'భారత్ వర్చువల్ యూనివర్శిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు తెలిపారు.ముఖ్యఅతిథిగా కమాండర్ ఇన్ ఆర్మీ చీఫ్‌కౌశిక్‌విశాల్‌హజరుకాగా, యూనివర్శిటీ డీన్ స్వామినాధన్ చేతుల మీదగా డాక్టరేట్‌ను అందుకున్నారు.

తిరుపతి డివిజన్

పవన్ కళ్యాణ్‌ను కలిసిన ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి హెల్త్, ఆగస్టు 24, ప్రభాతవార్త

రాజంపేట పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని తిరుగు ప్రయాణంలో రేణిగుంట విమానాశ్రయంలో జనసేన నాయకులు, బలిజసేన అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ప్రొ. గిరిధర్ ప్రసాద్ రాయ్ రచించిన బలిజరాయ తరంగిణి అనే పుస్తకాన్ని అందజేశారు. ఆ పుస్తకాన్ని స్వీకరించి పుస్తకం గురించి విన్నాని తెలిపారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆరణి మదన్, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, బెల్లంకొండ సురేష్, మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన డిఎస్పీగా నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నూతన డిఎస్పీగా నగరిలో డిఎస్పీగా పనిచేస్తున్న నరసింహ మూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధులు నిర్వహించడం కోసం ఇక్కడ డిఎస్పీగా విధులు నిర్వహించిన ఉమామహేశ్వరరెడ్డి ఎన్నికల నిర్వహ ణలో సమర్థవంతంగా విధులు నిర్వహించారు.ఈ సందర్భంగా నరసిం హమూర్తి డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శివయ్య క్షేత్రంలో పనిచేసేందుకు అవకాశం రావడం తన అదృష్టమన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. శివయ్యను దర్శించుకున్న అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించి తిరుపతి జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతేకాకుండా అర్బన్ సిఐ గోపి, రూరల్ సిఐ రవినాయక్, టుటౌన్ సిఐ వెంకటేశులు, బిఎన్‌కె ఎస్ఐ సిఐ తిమ్మయ్యలతో పాటు ఎస్ఐలు కలసి డిఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఫ్రీ హోల్డ్ భూములపై తహశీల్దార్ సమీక్ష

– తహశీల్దార్ మధుసూధనరావు

తొట్టంబేడు, ఆగస్టు 24 ప్రభాతవార్త

మండలంలోని ఫ్రీహల్డ్ భూములపై తహశీల్దార్ మధుసూధనరావు విఆర్ఓలు, సచివాలయ సర్వేయర్లుతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 41 రెవెన్యూ గ్రామాల్లో ఎన్ని రెవెన్యూ గ్రామాల్లో 31 రెవెన్యూ గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూములలు ఎన్ని చేశారో తెలుసుకున్నారు. మండలంలో 1500 ఎకరాల్లో ఫ్రీ హోల్డ్ భూములు సర్వేచేశామని వీటిపి తిరిగి రీసర్వేచేసి రికార్డులు వెరిఫికేషన్ చేయాలని సంబందిత అధికారులను తహశీల్దార్ ఆదేశించారు. ప్రతి ఒక్కరు బాధ్యతతో పనిచేయాలని లేకుంటే చర్యలు తప్పవని తొట్టంబేడు మండల తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలుస్వీకరించిన యు.మధుసూధనరావు సిబ్బందికి తెలిపారు. విఆర్ఓలు కూడా బాధ్యతగా పనిచేయాలని, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది సమావేశంలో రీ సర్వే డిటితో పాటు సచివాలయ సర్వేయర్లు, విఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి రేషన్ బియ్యం అందించాలి

తొట్టంబేడు, ఆగస్టు 23 ప్రభాతవార్త

ప్రతి ఇంటికి రేషన్ బియ్యం అందించాలని తహశీల్దార్ మధుసూధనరావు తెలిపారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, పిడిఎస్‌యు డీలర్లుతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మధుసూధనరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 36 రేషన్ దుకాణాలు ఉన్నాయని వాటి నుంచి ఇంటింటికి రేషన్‌బియ్యం చేరాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. బియ్యం పంపిణీలో ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న బియ్యంను ప్రతి ఒక్కరికి అందించాలని సూచించారు. పిడిఎస్‌యు డీలర్లు కూడా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఉదయం 7 నుంచి బియ్యం పంపిణీచేయాలని కోరారు. సాంకేతిక సమస్యలు ఎవైనా ఉంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో రేషన్‌దుకాణల డీలర్లు, పిడిఎస్‌యు సిబ్బంది పాల్గొన్నారు.

మహాభారత లిఖితపూర్వక పరీక్షల్లో విజేతలకు బహుమతులు ప్రధానం

ఏర్పేడు, ఆగస్టు24, ప్రభాతవార్త;

మండలంలోని పాపానాయుడుపేట పంచాయతీలో మహా భారతం గురించి నిర్వహించిన పరీక్షల్లో గెలుపొందిన వారికి శనివారం ఎంజీఎం ట్రస్ట్ చైర్మెన్ ఎం అర్జున్‌బాబు విజేతలకు జ్ఞాన పీఠ అవార్డులను ప్రధానం చేశారు. మొదటి బహుమతి జీపాళెం గ్రామానికి చెందిన టి సుగుణ, రెండవ బహుమతి జనార్ధన్‌శెట్టి, మూడవ బహుమతులు ఎ దొరతి, చేరి ఉదయ్ కుమార్, చెంచుకృష్ణపిళ్లై, చెంగారెడ్డిపట్టెడ గ్రామానికి చెందిన జ్యోతి లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో రాధాకృష్ణయ్య, శంకర్‌రెడ్డి, జాఫర్, రవి, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనండి

నగరంలోని యాదవ సోదరుల పిలుపు

తిరుపతి హెల్త్, ఆగస్టు 24, ప్రభాతవార్త

తుడా ఇందిరా మైదానంలో ఈ నెల 26వ తేది ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటలు వరకు కృష్ణాష్టమి వేడుకలు తిరుపతిలో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ సభ్యులు రాజేష్ యాదవ్, అన్న అనిత యాదవ్, శంకర్ యాదవ్‌లు తెలియజేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీ కృష్ణుని జన్మస్థలమైన ద్వారకాలోని మధుర ఆలయ నమూనాను సినీ తరహాలో భారీ సెట్టింగ్ ఏర్పాటు చేసి తిరుపతి ప్రజలకు కనువిందు చేయనున్నామన్నారు. కృష్ణ నామ, భగవద్గీత, పారాయణం పాదయాత్ర, అన్న ప్రసాదాలు వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరు నుంచి 14 సంవత్సరాల వయసుగల చిన్న పిల్లలు రాధాకృష్ణుల వేషధారణలతో రావాల్సి ఉందని పిలుపునిచ్చారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం నాలుగున్నర గంటలకు ఏర్పాటు చేస్తున్నామని, ఈ మహోత్సవంలో పాల్గొన్న చిన్న పిల్లలకు మూడు గ్రాముల ఉంగరాన్ని బహుకరిస్తున్నట్లు వారు తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో శీను యాదవ్, కృష్ణ యాదవ్, ఉదయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ప్రజలందరికీ అందుబాటులో మానవత సేవలు

నిర్వాహకులు వెల్లడి

తిరుపతి హెల్త్, ఆగస్టు 24, ప్రభాతవార్త

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి ప్రజలకు సేవలు అందించడానికి ముందుకొచ్చిందని ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం స్థానిక కొండారెడ్డి రాయలసీమ కళాశాలలో మానవత సంస్థ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మానవతా సంస్థ డైరెక్టర్లు మాధవ నాయుడు, సుకుమార్ రాజులు తెలియజేశారు. శనివారం ఉదయం తిరుపతి ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సంస్థ 2004లో ప్రారంభమైనదని ఇప్పటి వరకు దాదాపు 60 వేల మందికి పైగా ఇందులో సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రమాదాలలో ఎవరైనా గాయపడినట్లైతే వారిని వైద్యశాలలకు తరలింపు, చికిత్సలు అందజేస్తున్నామన్నారు. అలాగే పర్యావరన, పరిరక్షణ, రక్తదానం, ఉచిత మార్చురీ, ఫ్రీజర్లు , ఉచిత వైద్య శిభిరాలు కూడా అందుబాటులోకి తెచ్చి సేవలందిస్తున్నామని వారు తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో సంస్థ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రతిభకు బహుమతుల పురస్కారాలు

చంద్రగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త:

రాష్ట్ర స్థాయిలో వారధి ఫౌండేషన్ నిర్వహించిన వ్యాస రచన, డిబేట్ పోటీలలో మన విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బహుమతుల పురస్కా రాలు అందుకున్నట్లు ఎంఈఓ శ్రీవరం లలితకుమారి తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు శనివారం వారధి ఫౌండేషన్ వారిచే వ్యాసరచన, డిబేట్ మండల స్థాయి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో వ్యాసరచనలో ముగ్గురు, డిబేట్‌లో ముగ్గురు విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. వీరికి వారధి తరపున ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు తెలిపారు.ఈనెల27నజిల్లాస్థాయిలోనిర్వహించేపోటీలకు విజేతలను పంపనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అలుగు కార్యక్రమం

రామచంద్రాపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త:

ఎన్‌ఆర్ కమ్మపల్లిలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలలో ద్రౌపది మాత మహిమకు నిదర్శనంగా అలుగు నిలుపు కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు హరి ఆచ్చారి శిష్య బృందం బావి వద్దకు వెళ్లి స్నానమాచరించి తడి దుస్తులతో నూతన కుండలలో శుద్ధి జలాలను నింపుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో కత్తికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మేళతాళాలు, పంబలు వాయిద్యాలతో అమ్మవారికి పూజలు నిర్వహించి, మూడు అడుగుల పొడవైన కత్తిని కుండ అంచు పైభాగాన ఎటువంటి ఆధారం లేకుండా నిలబెట్టారు. ఈ అలుగు ఆదివారం రాత్రి అగ్నిగుండం ప్రవేశం జరిగేంత వరకు ఆలయంలో వుంటుందని అర్చకులు తెలిపారు.

నిబంధనల మేరకే ఫీల్డ్ అసిస్టెంట్లు, విఓఎల తొలగింపు

- వైసీపీ నాయకులకు బెదిరేది లేదు
- మండల పరిషత్ నిధుల వ్యయంపై ఎంపిడిఓ సమాధానం చెప్పాలి
- విలేఖరుల సమావేశంలో టిడిపి నాయకుల డిమాండ్

చిట్టమూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త

వైసీపీ ప్రభుత్వంలాగా అడ్డగోలుగా జీఓలు తెచ్చి దోచుకోవడం లేదని, నిబంధనల మేరకే ఆయా పంచాయతీల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, విఓఎలను తొలగించామని, దీనిపై శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వైసీపీ నాయకులు అనవసరమైన రాద్ధాంతం చేయడం తగదని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. శనివారం చిట్టమూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో మండల టిడిపి కన్వీనర్ కిషోర్‌నాయుడుతో పాటు పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొని మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చిట్టమూరు మండల పరిషత్ నిధులు ఏ పనులకు కేటాయించారో ఎంపిడిఓ షాలెట్ సమాధానం చెప్పాలన్నారు. త్వరలోనే ఈ నిధులు వ్యయంపై సమాచార హక్కు చట్టం ద్వారా కోరనున్నట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాయని, ప్రభుత్వం ఏర్పడిన 70 రోజుల్లోనే అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీయడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా 1వ తేదీకే పింఛన్లు ఇవ్వడంతో పాటు ఉద్యోగులకు జీతాలు కూడా అందుతున్నాయని గుర్తు చేశారు. ఐదు లక్షల కోట్లు లోటు బడ్జెట్ ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి వైపు అడుగులు వేయడం వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. ఈ నెల 23న జరిగిన గ్రామసభల్లో రెండు కోట్ల మేరకు సీసీ రోడ్లకు ప్రతిపాదనలు పంపామన్నారు. వైసీపీ పాలనలో చిట్టమూరు మండలంలోనే 700 కోట్ల మేరకు ఇసుక దోపిడీ జరిగిందని ఆరోపించారు. ఉప్పలమర్తి, దరకాస్తు గ్రామాలకు తాగునీటి సరఫరా జరగకుండానే నిధులు దోపిడీ జరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో గూడూరు నియోజకవర్గం గతంలోనే అభివృద్ధి చెందిందని, నేడు కూటమి ప్రభుత్వం హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో ముందుకు సాగుతున్నామని గుర్తు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో రాజకీయ కుట్రలకు తావులేదని, కలిసి వస్తే గ్రామాలను అభివృద్ధి చేసుకుంటామని, అలాకాకుండా సొంత ప్రయోజనాల కోసం సర్వసభ్య సమావేశాలను వాడుకొని అధికార పక్షంపై లేనిపోని నిందలు మోపితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సర్పంచులకు విలువ లేకుండా చేశారని, కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు 1450 కోట్లు నిధులు విడుదల చేయడం గొప్పవిషమని చెప్పారు. అలాగే చిట్టమూరు మండలంలోని ఆక్రమిత భూములపై నివేదికలు తయారు చేసి ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సహకారంతో పేదలకు పంచుతామని కిషోర్‌నాయుడు ఈ సందర్భంగా వెల్లడించారు. ఏదిఏమైనా వైసీపీ నాయకుల బెదిరింపులకు తెలుగుదేశం ప్రభుత్వం భయపడే పరిస్థితి లేదని, అభివృద్ధికి సహకరిస్తే చేయూతనిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గుండుబోయిన కస్తూరయ్య, బసివిరెడ్డి కృష్ణారెడ్డి, గంపర్ల శీనయ్య, కాపులూరు చెంచురామాచారి, ఆరూరు ఎంపిటిసి భార్గవి, అరవపాలెం, చిట్టమూరు సర్పంచులు రాజేష్‌రెడ్డి, కోటయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు

ఘనంగా వెంకయ్య స్వామి ఆరాధన మహోత్సవం

బాలాయపల్లి, ఆగస్టు 24, ప్రభాతవార్త

జయంపు వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేకువజామున సుప్రభాత సేవ, అభిషేకం, స్వామి వారి పూజ, హారతి, ప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తికి అభిషేకం, దత్తసంప్రదాయ షోడసోపచార పూజలు జరిగాయి. స్వామిని పూలతో అత్యంత రమణీయంగా అలంకరించారు. భక్తుల కోలాటం, పండరి భజన, మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ వైభవంగా సాగింది. ఆరాధన మొదటి రోజు కావడంతో ఉభయకర్తలతో పాటు భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఆధ్యాత్మికానందం పొందారు. అనంతరం రాత్రి వెంకయ్య స్వామి వాహనం పై కొలువుదీరి విహరించారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించబడిన వాహనం పై ఊరేగుతున్న వెంకయ్య స్వామిని చూసి తమ జన్మధన్యమైనట్లు భక్తులు పులకించిపోయారు. ఎన్ని రకాల పూలు ఉన్నా కలిపి కడితే అన్ని ఒకే మాలగా ఉన్నట్లు మనుషులంతా ఒక్కటేనన్న భావనను కలిగించేలా స్వామిని వివిధ రకాల పూలతో అలంకరించారు.



అందరిదేవుడు శ్రీకృష్ణభగవానుడు

-బిసివై రామచంద్రయాదవ్

పుంగనూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీకృష్ణభగవానుని ఆలయం అభివృద్ధికి అందరిక సహకారం తీసుకోవాలని, ఎందుక ంటే శ్రీకృష్ణపరమాత్ముడు సర్వమానవాళి క్షేమం కోసం గీతను బోధించారని, ఇక్కడ పార్టీలు వర్గాలు, వ్యక్తులు, వ్యవహారాలను దూరం పెట్టాలని బిసివై జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ అన్నారు. ఇప్పటి వరకు జరిగిన కృష్ణజన్మాష్టమి వేడుకల కంటే మరింత వేడుకగా నిర్వహించుకోవాలన్నారు. ఆలయాలకు రాజకీయరంగు, వర్గ విబేధాలు పెట్టకుండా దేవాలయ అభివృద్ధికి తాను పదిలక్షల రూపాయల విరాళం అందిస్తున్నట్లు ప్రకటించారు. ఆలయాలకు ఎపుడూ సేవలందించేదుకు ముందుంటానన్నారు..

26 నుంచి శ్రీ గీతామందిరంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలు

పుత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ గీతామందిరంలో ఈ నెల 26వ తేదీ నుంచి సెప్టెంబరు 3 తేదీ వరకు శ్రీకృష్ణ జయంతి మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీగీతాసేవా సమాజం వారు తెలిపారు. ఈ నెల 26న సోమవారం ఉదయం 6 గంటలకు అఖండ గీతా పారాయణం రాత్రి 8 గంటల వరకు సర్వదర్శనం, భజన కార్యక్రమాలు, రాత్రి 9 గంటలకు శ్రీకృష్ణ జననం ఉయ్యాల సేవా కార్యక్రమం, 27న మంగళవారం ఉదయం ఆల యంలో స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు సాయం త్రం 6 గంటలకు వేదాంతం శ్రీనివాస భట్టాచార్యులు వారిచే ప్రవచనాలు, 28న బుధవారం ఉదయం ఆలయం లో స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరణ, సాయంత్రం 6 గంటలకు వేదాంతం శ్రీనివాస భట్టాచార్యుల వారిచే ప్రవచనం, 29న గురువారం ఉద యం స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, సాయంద్రం వేదాంతం భట్టాచార్యుల వారిచే ప్రవచనం, 30న శుక్రవారం సాయంత్రం 5 గంటలకు శ్రీ రుక్మిణీ కల్యాణం కార్యక్రమం, 31న శుక్రవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సెప్టెంబరు 1న ఆదివారం సాయంత్రం 6 గంటలకు వేదాంతం శ్రీనివాస భట్టాచార్యుల వారిచే ప్రవచనం, 2న సోమవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం వేదాంతం భట్టాచార్యుల ప్రవచనం, 3న మం గళవారం ఉదయం అభిషేకాలు, అలంకరణలు, సాయం త్రం గోపూజ కార్యక్రమం, తోటోత్సవం, వసంత ఉత్సవా లు, నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వైకాపా నాయకుల ప్రోద్భలంతో

మాపై అక్రమకేసులు పెట్టారు

-జిల్లా కలెక్టర్ శ్రీనివాసులుకు షికారీల మొర

పుంగనూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త

కొండకోనల్లోని తమ పొలాలకు దారి అడ్డువేసిన వైకాపా నాయకులపై పోలీసులకు ఫిర్యాదుచేయడంతో తమ ఇండ్లలో తాబేలు వేసి, తమ నాయకుడు అంకయ్యను అరెస్టు చేసి, ఫారెస్టు అధికారులే ఒక తుపాకీ తెచ్చి ఫోటో తీసి రిమాండ్‌కు పంపారని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని పుంగనూరు షికారీపాలెం ప్రజలు జిల్లా కలెక్టర్ శ్రీనివాసులును కోరారు. ఈమేరకు శుక్రవారం మధ్యాహ్నం ఆయనను కలసి తమ గోడు విన్న వించుకున్నారు. ప్రభుత్వం తమకు వ్యవసాయానికి భూమి ఇవ్వగా అందులో వెళ్ళడానికి దారిలేకుండా చేశారని పోలీసులకు ఫిర్యాదుచేయడంతో తమపై కక్షకట్టి తాబేలు తీసుకువచ్చి ఇంట్లో వదిలారని, ఫారెస్టు కార్యాలయానికి తీసుకువచ్చి, ఎక్కడ నుంచో తీసుకువచ్చిన తుపాకీను తెచ్చి ఫోటో తీసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారని కలెక్టర్‌కు వివరించారు. తుపాకీ ఎక్కడ నుంచి వచ్చిందో దర్యాప్తుచేయాలని వారు కలెక్టర్‌ను కోరారు.

ఎన్డీయే ప్రభుత్వంలో మరలా బిందుసేద్యానికి ప్రాధాన్యత : కంచర్ల శ్రీకాంత్

కుప్పం/శాంతిపురం/రామకుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఎన్డీయే ప్రభుత్వ పాలనలో మరలా బిందుసేద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ, సమన్వయకమిటీచైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం కుప్పం, శాంతిపురం, రామకుప్పం మండలకార్యాలయాల్లో రైతులకు బిందుసేద్యంపై ఉద్యానవన శాఖచే అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనలో రైతులకు బిందుసేద్యం కింద ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. రైతులకు మొండిచేయి చూపిందన్నారు. గతంలో సిఎం చంద్రబాబునాయుడు దేశానికే తొలిసారి బిందుసేద్యాన్ని పరిచయం చేశారన్నారు. జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ 5ఎకరాలలోపు పొలం కలిగిన రైతులకు 90శాతం రాయితీ, 5-10ఎకరాల రైతులకు 70శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే శాశ్వత పందిళ్ల వేసుకునే వారికి ఎకరాకు లక్ష, ప్యాక్ హౌస్‌కు 2లక్షలు, ఫార ంపండ్ నిర్మాణాలకు 75వేలు, మల్చింగ్ కోసం 16వేలు, పళ్ల తోటలవారికి 16వేల వంతున రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, నేతలు సాంబశివ ం, విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, సత్యేంద్రశేఖర్, అనసూయ, ఎఒ అమృతవల్లి, హెచ్ఒ డింపుప్రియశ్రీ, వింధ్య, పద్మజ, ఎఇఒ ఔరంగ్, రైతులు పాల్గొన్నారు.



నిత్యాన్నదాన పథకానికి 6 లక్షలు విరాళం

కాణిపాకం, ఆగస్టు 24 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు 6 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు బెంగుళూరుకు చెందిన పి.బాబు అనే భక్తులు నిత్యాన్నదాన పథకంకు 5 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. అలాగే దామల్‌చెరువుకు చెందిన మండుటి సునీల్‌కుమార్ అనే భక్తుడు లక్ష రూపాయల చెక్‌ను నిత్యాన్నదాన పథకంకు విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తా_న్ని వేర్వేరుగా ఆలయ ఈఓ కె.వాణికి అందజేశా రు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేకదర్శనం కల్పించి వేదపండితుల ఆశీర్వచనం అందించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు రవి, విఘ్నేష్‌లతో పాటు దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో రెండు రోజుల పాటు సెమినార్

తిరుపతి హెల్త్, ఆగస్టు 24, ప్రభాతవార్త

స్విమ్స్‌లోని కార్డియోథోరసిక్ అండ్ వాస్కులర్ సర్జరీ విభాగం, శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేది నుంచి 25వ తేది ఉదయం 9 గంటలకు శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో ఫోకస్ట్ మీట్ ఆఫ్ పీడియాట్రిక్స్ అండ్ కంజెనిటల్ స్పేస్ హార్ట్ సర్జన్స్ ఇండియా అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్వి కుమార్ మాట్లాడుతూ ంరెండు రోజుల పాటు జరిగే సిటి సర్జరీ, శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో భాగంగా మొదటి రోజు సంక్లిష్టమైన ఆపరేషన్లు ఎలా చేయాలి అనే అంశం పై నిష్ణాతులైన వైద్యులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ నెల 25న చిన్న పిల్లల గుండె పనితీరు, ఆపరేషన్లను నిర్వహించే పద్ధతిని వర్క్ షాపు ద్వారా తెలియజేయడం జరుగుతుందని, దీని ద్వారా పేషంట్ కేర్ అభివృద్ధి చెందుతుందని, ఈ సెమినార్ ద్వారా స్విమ్స్, శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ జాతీయ స్థాయిలో గుర్తింపు కూడా వస్తుందని తెలిపారు. దేశంలోని దాదాపు 150 మంది ప్రతినిధులు హాజరైనట్లు, అదే విధంగా ఈ సెమినార్‌లో వైద్య పరికరాలతో కూడిన స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఆలస్యం లేకుండా భక్తులను దర్శనానికి వదలాలి

-అనధికార పార్కింగ్‌పై అదనపు ఈఓ ఆగ్రహం

తిరుమల, ఆగస్ట్ 24ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వచ్చిన సామాన్యభక్తులు వీలైనంత తక్కువ సమయంలో దర్శనం చేసుకునేలా చూడాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశించారు. వైకుంఠం కంపార్టు మెంట్లలోంచి భక్తులను దర్శనానికి ఆలస్యం లేకుండా వదలాలన్నారు. శనివారం వేకువ జామున తిరుమలలో పలుచోట్ల ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. కృష్ణతేజ కూడలి వద్ద భక్తులు క్యూలైన్లలోనికి ప్రవేశించే మార్గాల వద్ద కొందరు ప్రైవేట్ ట్యాక్సీ, జీపు డ్రైవర్లు అడ్డంగా పార్కింగ్ చేయడాన్ని చౌదరి గమనించారు. దీనిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అనధికారిక పార్కింగ్ నివారించేందుకు స్థానిక పోలీసులతో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పెట్రోల్ క్యానుతో జనసేన నాయకుడి నిరసన

కాణిపాకం, ఆగస్టు 24 ప్రభాతవార్త:

కాణిపాకం గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను నిలుపుదల చేయాలని కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండు చేస్తూ శనివారం స్థానిక జనసేన నాయకుడు రాజ్‌కుమార్ పెట్రోల్ క్యానుతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కాణిపాకం కాణిపాకం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన స్థలంలో ఓ వ్యక్తి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకుండా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ రాజ్‌కుమార్ శనివారం ఉదయం పంచాయతీ కార్యాలయంలోకి పెట్రోల్ బాటిల్‌తో వెళ్ళి గేటుకు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. దీనితో అక్రమ నిర్మాణ పనులను పంచాయతీ అధికారులు నిలుపుదల చేశారు.



రింగ్‌రోడ్డు నిర్మాణ పనుల్లో అపశృతి

- బండరాయి మీదపడి ఇటాచి డ్రైవర్ మృతి

(ఫైల్‌ఫోటో)

గుడిపాల, ఆగస్టు 24 ప్రభాతవార్త: గుడిపాల మండల పరిధిలో చీలాపల్లి ఈస్టర్ కొండ పరిసరాల్లో జరుగుతున్న బెంగళూరు-చెన్నై రింగ్ రోడ్డు నిర్మాణ పనుల్లో శనివారం అపశృతి చోటు చేసుకుంది. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కొండ మీద తవ్వకాలు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ బండరాయి ఇటాచీ డ్రైవర్‌పై పడటంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాంపూర్ జిల్లాకు చెందిన డ్రైవర్ బాలెండర్(24) మృతి చెందాడు. గుడిపాల మండలం చీలాపల్లి పరిసరాల్లో గత కొంతకాలంగా బెంగళూరు-చెన్నై రింగ్ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కొండ మీద తవ్వకాలు చేస్తుండగా ప్రమాదవశాత్తు కొండపై వున్న బండరాయి ఇటాచీ వాహనంపై పడటంతో ఇటాచీకి డ్రైవర్‌గా పని చేస్తున్న బాలెండర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ సంఘటనా స్థలం చేరుకుని ప్రమాద సంఘటనను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుచ్చివాహనంపై ఉత్సవమూర్తులు దేవేరులతో

చంద్రగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ తిరుమాడ వీధులలో దేవదేవుడు తన దేవేరులతో కలసి తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాది నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగారు. స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కె.ఎస్.రాజు, గోపాల భట్టాచార్య,

దివ్యదర్శనం టోకెన్ల కేంద్రాలు తనిఖీ

తిరుమల, ఆగస్ట్ 24ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వస్తున్న సామాన్యభక్తులకు మరింత సులభంగా టైమ్‌స్లాట్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డి)టోకెన్లు జారీప్రక్రియ సులభతరం చేయనున్నట్లు టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. ఇందుకు టోకెన్లు జారీప్రాంతంలో శాశ్వత క్యూలైన్లు, ఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అలిపిరి మెట్లమార్గంలో దివ్యదర్శనం టోకెన్లు జారీనీ పునఃప్రారంభించేందుకు సాధ్యాసాధ్యాలను ఆయన పరిశీలించారు.